క్లుప్తంగా

ఎమ్మెల్యే చంటిబాబును కలసిన చిత్ర బృందం

జగ్గంపేట: ఇందిరా ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న హర్రర్ విత్ టెర్రర్ చిత్ర బృందం ఇర్రిపాకలో గురువారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కలిశారు. జగ్గంపేట పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో ఈ నెల 10 నుంచి 15 వరకూ సినిమా షూటింగ్ చేయనున్నట్టు సినిమా డైరెక్టర్ వంశీరాజు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే సహకారాన్ని కోరారు.

భవిత కేంద్రానికి ఫ్యాన్, కుర్చీల వితరణ



ఏలేశ్వరం భవిత కేంద్రం సిబ్బందికి ఫ్యాన్, కుర్చీలు అందజేస్తున్న సోమరాజు

ఏలేశ్వరం: స్థానిక భవిత కేంద్రానికి గురువారం మండల పెన్షనర్స్ సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు ఒక సీలింగ్ ఫ్యాన్, ఐదు కుర్చీలు బహూకరించారు. స్థానిక భవిత కేంద్రంలో సిబ్బందికి సోమరాజు తన సతీమణి నాగరత్నం జ్ఞాపకార్థం వీటిని అందజేశారు. తన సతీమణి నాగరత్నం పేరిట గత ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సోమరాజు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వాణీపద్మజ, బుజ్జి, దివ్య, కాపు సంక్షేమ సంఘం కార్యదర్శి కటకం కిరిటీ, గోళ్ల నాగేశ్వరరావు, వుడతల రమణారావు, సత్యగాంధీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తుని: జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. సంఘ జాతీయ ఉపాధ్యక్షులుగా రాంపల్లి వెంకటరమణ, వాడపల్లి వెంకటరమణమ్మ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా లక్కాకుల బాబ్జీ, జాతీయ కార్యవర్గ సభ్యులుగా దాడి గోవిందరావు, సీహెచ్ రామకృష్ణ ఎన్నికైనట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తెలిపారు. ఈ నెల 2న గాంధీ జయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో సంఘ జాతీయ మహా సభ జరిగిందని, ఈ సభలో 60 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు తెలిపారు. జాతీయ కార్యవర్గంలో చోటు దక్కించుకున్న సభ్యులను పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సి.రాయవరం, రమణయ్యపేట, టీఎల్ పురం, జె.అన్నవరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

తుని: పట్టణంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్సై ఎస్. రామలింగేశ్వరరావు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..స్థానిక రామకృష్ణా కాలనీ, పరదేశమ్మ గుడి వద్ద సారా అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు అలవాటు పడిన నిందితుడు రౌతులపూడి మండలం నుంచి సారా తీసుకొచ్చి పట్టణంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కిర్లంపూడి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణవరం వద్ద గురువారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టుకు అప్పగించడంతో ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించినట్టు కిర్లంపూడి ఎస్సై పి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

కోడి పందేలాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాక శివారు ఏలేరు కాలవ వద్ద కోడిపందేల శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 2 కోళ్లు, రూ.3600 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజు తెలిపారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బి.నాగేశ్వరరావు అప్పుల బాధ తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం అప్పుల బాధతో ఈ నెల 3న గడ్డిమందు తాగిన నాగేశ్వరరావును కుటుంబ సభ్యులు చికిత్స కోసం తునిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు స్థానిక ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు.

ఆదాయం ఫుల్.. వసతులు డల్

- విస్తరణకు నోచుకోని వనదుర్గ అమ్మవారి మండపం
- ప్రతి శుక్రవారం, పర్వదినాల్లో అమ్మవారికి హోమాలు
- టిక్కెట్ల విక్రయం ద్వారా ఏటా రూ.25 లక్షల ఆదాయం
- మండపం సరిపోక ఇబ్బంది పడుతున్న భక్తులు
- మధ్యలోనే నిలిచిపోయిన విస్తరణ పనులు



ప్రత్యంగిర, చండీ హోమాల్లో పాల్గొనే భక్తులతో నిండిపోయిన మండపం



మధ్యలో నిలిచిపోయిన మండపం విస్తరణ పనులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి ఆలయానికి చండీ, ప్రత్యంగిర హోమాల ద్వారా ఏటా భారీగా ఆదాయం వస్తోంది. అమ్మవారి హోమాల్లో పాల్గొనే భక్తులు క్రమేణా పెరగడంతో అమ్మవారి మండపం సరిపోవడం లేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ హోమాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి ఏటా రూ.25 లక్షలు ఆదాయం వస్తున్నప్పటికీ మండపాన్ని విస్తరించకపోవడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశేష ప్రాచుర్యం పొందిన అమ్మవారి హోమాలు

రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి ప్రతి శుక్రవారం చండీహోమం, పౌర్ణమి, అమావాస్య పర్వదినాల్లో ప్రత్యంగిర హోమాలు నిర్వహిస్తారు. ఈ హోమాల్లో పాల్గొంటే తమ కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. దీంతో ప్రతి శుక్రవారం నిర్వహించే చండీ హోమంలో భారీగా భక్తులు పాల్గొంటున్నారు. అమ్మవారి ఆలయం ముందు గల మండపంలోనే హోమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు హోమం తిలకిస్తూ మండపంలోనే కూర్చుంటున్నారు. 30 జంటలకు మించి భక్తులు హోమాల్లో పాల్గొంటే మండపం నిండిపోతుంది. ఒక్కోసారి వందకు పైగా జంటలు ఈ హోమంలో పాల్గొంటున్నాయి. అటువంటప్పుడు భక్తులతో మండపం కిక్కిరిసిపోతోంది. చాలా మంది భక్తులు మండపం బయట కూర్చోవలిసి వస్తోంది. గత శుక్రవారం పౌర్ణమి కలిసి రావడంతో రత్నగిరిపై చండీ, ప్రత్యంగిర హోమాలు నిర్వహించారు. 134 జంటలు హోమాల్లో పాల్గొన్నాయి. దీంతో మండపం సరిపోక సగం మంది భక్తులు బయట నిలబడ్డారు.

టిక్కెట్ల ద్వారా ఆదాయం

చండీ, ప్రత్యంగిర హోమాల టిక్కెట్ల విక్రయాల ద్వారా ఏటా దేవస్థానానికి రూ.25 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. భక్తులు రూ.750 టిక్కెట్‌తో చండీ, ప్రత్యంగిర హోమాల్లో పాల్గొనవచ్చు. సాధారణ రోజుల్లో 20 నుంచి 25 మంది భక్తులు ఈ టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొంటున్నారు. పర్వదినాల్లో వందకు పైగా భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొంటున్నాయి. గత శుక్రవారం రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి మొత్తం 101 మంది చండీహోమంలో, 33 మంది ప్రత్యంగిర హోమంలో పాల్గొన్నారు. రూ.1,116 చొప్పున ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసి ముగ్గురు భక్తులు చండీహోమంలో, మరో నలుగురు భక్తులు ప్రత్యంగిర హోమంలో పరోక్షంగా పాల్గొన్నారు. ఈ టిక్కెట్లు విక్రయం ద్వారా దేవస్థానానికి రూ.1,08,312 ఆదాయం సమకూరింది.

మండపం విస్తరించాలని ఈఓ ఆదేశించినా...

రెండు నెలలు క్రితం రెండు హోమాలు ఒకే రోజు నిర్వహించినప్పుడు ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఈఓ చంద్రశేఖర్ అజాద్ వనదుర్గ ఆలయం దిగువన గల మండపం మధ్యలో హోమగుండం ఏర్పాటు చేసి హోమం నిర్వహించాలని సూచించారు. అంతేకాకుండా ఎక్కువ మంది హాజరయ్యేందుకు వీలుగా మండపాన్ని పది అడుగుల మేర తూర్పు వైపు విస్తరించాలని ఆదేశించారు. దాంతో వనదుర్గ ఆలయం దిగువన మండపంలోని సామగ్రి వేరే చోటుకు తరలించారు. మండపం విస్తరించడానికి నాలుగు ఫిల్లర్లు నిర్మించారు. ఆ తరువాత పనులు నిలిచిపోయాయి. ఈ ఫిల్లర్లు మీద సెంట్రింగ్ చేసి శ్లాబ్ వేస్తే సరిపోతుంది.

భక్తులు మరింత పెరిగే అవకాశం

రత్నగిరిపై వచ్చే నెల 15వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. అలాగే కార్తిక మాసంలో కూడా హోమాలకు కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈలోగా మండపాన్ని విస్తరించాలని భక్తులు కోరుతున్నారు.

త్వరలోనే మండపం విస్తరణ

వనదుర్గ అమ్మవారికి హోమాలు నిర్వహించే మండపం విస్తరణకు టెండర్ పిలిచాం. త్వరలోనే శ్లాబ్ వేస్తాం. ప్రస్తుతం అమ్మవారికి ఈ శాన్యంలో హోమం నిర్వహిస్తున్నారు. దీనిని ఆలయం దిగువన గల మండపంలోకి మార్చి దాని మధ్యలో హోమం నిర్వహించాలని ఆదేశించాం.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ, రత్నగిరి దేవస్థానం

నేడు మంత్రి రాజా పర్యటన

తుని: స్థానిక సీతారాంపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్మించిన అదనపు భవనాన్ని శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 60 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరోకరు పరారైనట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. లంపకలోవలో సారా తయారు చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్ఈబీ సిబ్బంది సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ కేసులో జుట్టుకు పుల్లయ్యను అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో కె. వీరబాబును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నుంచి పరారైన మాసా కృపారావుపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఇంటిలిజెన్స్ వింగ్ ఇనస్పెక్టర్ కె.గిరిధర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ బి.వెంకటేశ్వరరావు, కాకినాడ ఎస్ఈబీ సీఐ పి.సునీల్ కుమార్, ప్రత్తిపాడు ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



రాజపూడిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రాజపూడిలో నూతనంగా నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందబాటులోకి వచ్చాయన్నారు. భవిష్యత్‌లో సచివాలయాల్లో మరిన్ని సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని, గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు, వైఎస్సార్ సీపీ నేత కరుటూరి వీర్రాజు, న్యాయవాది సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన బాలిక



తల్లికి బాలికను అప్పగించిన రూరల్ సీఐ, ఎస్సైలు

తుని రూరల్: బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు ఇచ్చిన రెండు గంటల్లోనే రూరల్ పోలీసులు ఆమెను వెతికి పట్టుకుని తల్లికి అప్పగించారు. మండలంలోని ఎస్.అన్నవరం శివారు రామకృష్ణ నగర్‌కు చెందిన షేక్ వలి, హుసెన్ బీబీల కుమార్తె షేక్ ఆసిఫ్ (రెండున్నరేళ్లు) కనిపించడం లేదని గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై విజయబాబు తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. షేక్ ఆసిఫ్ తమ ఇంటికి కొద్ది దూరంలోనే ఇతర చిన్నారులతో ఆడుకుంటుండడంతో గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. తల్లి హుసెన్‌బీబీకి బంధువులు సమక్షంలో ఆసిఫ్‌ను అప్పగించారు. పిల్లలను వదిలేయవద్దని, ఆడుకుంటున్న పిల్లలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

ఎంపీపీ నాగబాబుకు పితృ వియోగం



అత్తులూరి నాగేశ్వరరావు (ఫైల్)

జగ్గంపేట: స్థానిక ఎంపీపీ అత్తులూరి నాగబాబుకు పితృవియోగం కలిగింది. ఎంపీపీ నాగబాబు తండ్రి నాగేశ్వరరావు (90) గురువారం జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని వారి స్వగ్రామం మల్లిసాలకు తరలించారు. నాగేశ్వరరావు పారిశ్రామిక వేత్తగా, నాయకుడిగా అందరికీ సుపరిచితుడు. ఆయన ఎంతో మందికి ఉపాధి కల్పించారు. మల్లిసాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రెండు ఎకరాల భూమిని దానం చేశారు. ఎంతో మంది పేదల విద్యాభివృద్ధికి సహకరించారు. నాగేశ్వరరావు మరణవార్త తెలియగానే ఎంపీపీ నాగబాబు, ఆయన సోదరులు సాయిబాబు, శ్రీనివాసులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఫోన్‌లో పరామర్శించారు. అత్తులూరి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ మంత్రి తోట నరసింహం, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు అత్తులూరి బ్రదర్స్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ప్రత్తిపాడు కోర్టులో విధులు బహిష్కరించి ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: కోర్టులో పిటీషన్లకు రూ.1 స్థానంలో రూ.20 స్టాంపులు వేయాలని బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రత్తిపాడు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులను బహిష్కరించి ధర్నా చేపట్టారు. గురువారం నుంచి కోర్టు పిటీషన్లకు రూ.20 స్టాంపు అతికించాలని బార్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై బార్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలో వకల్తాకు అతికించే వెల్ఫేర్ స్టాంపు రూ.30 ఉండగా ఆంధ్రరాష్ట్రంలో రూ. 100కు పెంచారన్నారు. ప్రస్తుతం పిటీషన్‌కు వేసే స్టాంపు విలువ పెంచడం సరి కాదన్నారు. బార్ అసోసియేషన్ల ఆమోదం లేకుండా బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంపై సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి బొంగుళూరి మధుబాబు, గౌరవాధ్యక్షుడు చెలంకూరి రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు రమణం వెంకటరావు, రాజాల చిట్టిబాబు, బండారు నరసింహరావు, పలివెల నాగేంద్ర, కందా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జగ్గంపేట: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం మండలం విరవాడ గ్రామానికి చెందిన కొమ్మినీడి శివదుర్గ (24) దివిలిలోని బీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయంలో జగ్గంపేట శివారులో ఉన్న పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. గతంలో కోళ్ల ఫారం పెట్టుకోవడానికి రూ.3 లక్షలు అప్పు చేశాడు. ఆ సొమ్మును ఆన్‌లైన్‌లో క్యాసినో ఆడి పోగొట్టుకొన్నాడు. ఈ విషయం ఇంట్లో చెపితే తిడతారన్న భయంతో గత నెల 30న పెట్రోల్ బంక్ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పెట్రోల్ బంక్ సిబ్బంది అతడిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు కొమ్మినీడి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక హెచ్‌సీ పి.సూరిబాబు తెలిపారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- యర్రంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష



యర్రంపాలెంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కత్తిపూడిలో రోగులకు పరీక్ష రిపోర్టు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

గండేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని యర్రంపాలెం సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, జేసీఎస్ గ్రామ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని కత్తిపూడి సచివాలయం-2లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్లు 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఓ వరమన్నారు. గ్రామాల్లో 45 రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం రోగులకు మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. క్యాక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, వైద్యుడు ఎస్.రాజీవ్, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, కోఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గౌతు అర్జుబాబు, మాదేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

ఏలేశ్వరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని మర్రివీడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామాల్లో పేదలకు పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. తొలుత ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పల్లెల బ్రహ్మాజీరావు, బంటుపల్లి ప్రసాద్, కస్తూరి అప్పలరాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ఆరోగ్యానికి భరోసా

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. కృష్ణవరం గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గంధీతో కలిసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ హెల్త్ కౌంటర్లను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషక ఆహార స్టాల్‌ను సందర్శించారు. అనంతరం రోగులకు వైద్య కిట్లలను, బాలింతలకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యులు 502 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మరో 20 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరకపూడి అనంతలక్ష్మి, ఎంపీటీసీ మమత, వైఎస్సార్ సీపీ నాయకులు గొరకపూడి గోపి, అడబాల వెంకటేశ్వరావు, బోనగిరి కాశీవిశ్వనాథం, పెంటపాటి తాతాజీ, దోమాల గంగాధర్, జనపరెడ్డి బాబు, పాతంశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బెండపూడిలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ నాగం గంగబాబు



కేపీ మల్లవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మెరుగైన వైద్యం

కోటనందూరు: పేదలకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ గర్సింగు శివలక్ష్మితో కలిసి ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో పలు విభాగాలను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొంగబాబు, కొరుప్రోలు కృష్ణ, ఉపసర్పంచ్ దార్ల సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. బెండపూడిలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీ డాక్టర్ రవికుమార్ తదితరులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, మేరుగు ఆనందహరి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణ, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, పార్టీ మండల కన్వీనర్ బద్దినూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, దూళ్లిపూడి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే లక్ష్యం

జగ్గంపేట: పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రాజపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ శారు. బాలింతలకు పౌష్టికాహారం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాజపూడి గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని, వైఎస్సార్ సీపీ నేత, న్యాయవాది సోమరాజు, ఎంపీడీఓ వసంతరావు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో వైద్యసేవలు

తుని రూరల్: గ్రామీణులకు సైతం అందుబాటులో వైద్యసేవలు ఉంచాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. తుని మండలం కేఓ మల్లవరంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గ్రామ సర్పంచ్ డొంక సత్యవతితో కలసి ఎంపీపీ ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరావు, జేసీఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు డొంక వెంకట బెనర్జీ, చిటికెల వరహాలబాబు, ఏకా కన్నయ్య పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యం

రౌతులపూడి: ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ అన్నారు. మండలంలోని గంగవరంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య సిబ్బంది 256 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 82 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 70 మందికి కళ్ల జోళ్లు అందజేశారు. ఎంపీడీఓ ఎం గోవిందు, సర్పంచ్ సైపురెడ్డి కనకలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మర్రివీడులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బుజ్జి



కోటనందూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



కృష్ణవరంలో బాలింతకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

గోకవరం: గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. గోకవరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. డాక్టర్లు శ్రీనివాస్, అబ్రహం, సునీల్, ఆలేఖ్య, నిఖిత, కుమార్, ధనుంజయరెడ్డి 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్, చింతల అనిల్ కుమార్, యేసు,రామ్ ప్రసాద్ నరసయ్య పాల్గొన్నారు.